క్లుప్తంగా

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

అంబాజీపేట: ఐదేళ్లలోపు వయస్సు ఉన్న చిన్నారులకు ఆధార్ నమోదును తప్పనిసరిగా చేయించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం కొర్లపాటివారిపాలెం సచివాలయం–1 వద్ద ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు తప్పనిసరి నేపథ్యంలో చిన్నారుల తల్లిదండ్రులు అలసత్వం వహించకుండా నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని తేదీ వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్‌లో పేరు, చిరునామ మార్పులు, ఫొటో మార్పులు ఉన్న వాటిని సవరణ చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కొర్లపాటి గోపి, సూదాబత్తుల రాము, కొర్లపాటి వెంకటేశ్వరరావు, సుంకర పేరయ్యనాయుడు, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

మహిళ భౌతికకాయానికి అంత్యక్రియలు



అమలాపురంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సిబ్బంది

అంబాజీపేట: ఈ నెల24వ తేదీన పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని మతిస్థిమితం లేని గుర్తు తెలియని మహిళకు మృతి చెందింది. ఆ మహిళ మృతదేహానికి అమలాపురం మున్సిపాలిటీ శ్మశాన వాటికలో గురువారం అంత్యక్రియలు నిర్వహించినట్టు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. స్థానిక సర్పంచ్ జల్లి బాలరాజు, మాచవరం నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారని ఎస్సై తెలిపారు. యలమంచలి బుచ్చిబాబు, సత్యాల కొండలరావు, నాగాబత్తుల మధుబాబు సహకరించడంతో ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని తరలించామన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిరసన

రాజోలు: పాస్టర్ ప్రవీణ్ మృతిపై దళిత చైతన్య వేదిక సభ్యులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నాయకులు ఆందోళన నిర్వహించారు. క్రైస్తవులపై దాడులు నివారించాలని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌కు అందజేశారు. నాయకులు మటా సురేష్‌కుమార్, విప్పర్తి సాయిబాబు, జిల్లెళ్ల వినోద్, దీపాటి శివ ప్రసాద్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో కథం తొక్కిన క్రైస్తవులు

కొత్తపేట: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి, న్యాయం చేయాలని పాస్టర్లు, క్రైస్తవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీడబ్ల్యుఎస్, ఇవాంజికల్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కొత్తపేటలో మండల పాస్టర్లు, అత్యధిక సంఖ్యలో క్రైస్తవులు గురువారం సాయంత్రం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.

పారిశుధ్య ఏర్పాట్లపై సమీక్ష

ఆలమూరు: చింతలూరులో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే శ్రీనూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాల్లో చేపట్టవలసిన పారిశుధ్య ఏర్పాట్లపై గురువారం సమీక్ష జరిగింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మార్గని కరుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామచంద్రపురం డివిజన్ ఇన్‌చార్జి డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఏ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పారిశుధ్యం కోసం తీసుకోవలసిన చర్యలపై మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.7,05,284

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ హుండీలను గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. భక్తుల నుంచి రూ.7,05,284 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, గ్రూపు టెంపుల్స్ ఈఓ టి.నాగవిష్ణు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ 8 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చింది. ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, ఉండపల్లి అంజి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీడీ ఆధ్వర్యంలో మేట్లకు శిక్షణ

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పీడీ డి.రాంబాబు ఆధ్వర్యంలో మేట్లకు శిక్షణనిచ్చారు. ఏపీఓ ఎ.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. మేట్లకు ఎన్ఎంఎంఎస్, కొలతలు, క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీల మస్టర్ల నిర్వహణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. వేసవిలో కూలీల కోస జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో 265 మంది ఉపాధి మేట్లు పాల్గొన్నారు.

సర్వేతో గుండెల్లో గుబులు

- పీ–4 సర్వేపై అనుమానాలు
- 27 ప్రశ్నలకు సమాధానాల సేకరణ
- పథకాలు తీసివేస్తారేమోనని ప్రజల్లో ఆందోళన



మాచవరంలో ఇంటింటా సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

అంబాజీపేట: ప్రభుత్వం కొత్తగా సర్వేలు ప్రారంభించింది. ఈ సర్వేతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. మండలంలో పీ–4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే కొనసాగుతోంది. మండల పరిషత్ ఆధ్వర్యంలో 20 సచివాలయాల పరిధిలో ఇళ్లను సర్వే చేస్తున్నారు. పేదలకు ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తోందని అధికార యంత్రాంగం చెబుతున్నా ప్రజల్లో ఆందోళన నెలకొంది. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అడుగుతున్న ప్రశ్నలకు ప్రజలకు ఖంగుతింటున్నారు. సంక్షేమ పథకాల ఏరివేతకేనా ఇటువంటి ప్రశ్నలు వేస్తున్నారనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. సర్వేపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు కూడా విఫలమవుతున్నారు.

ప్రశ్నలే.. ప్రశ్నలు

సచివాలయ సిబ్బంది క్లస్టర్ల వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27 ప్రశ్నల ఆధారంగా సమాచారం నమోదు చేస్తున్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా, ఇంటింటా సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది ఇంట్లో టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఏసీ, ల్యాప్ టాప్ వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. ఇంట్లో ఎంతమంది సంపాదిస్తున్నారు. ఉద్యోగం చేస్తున్నారా, ఆస్తులు, ఆదాయం ఇన్‌కామ్ ట్యాక్స్, బైక్, కారు ఉన్నాయా వంట గ్యాస్ నెలకు ఎంత కరెంటు బిల్లు వస్తుంది. కుళాయి కనెక్షన్ ఉందా తదితర ప్రశ్నలు వేస్తుండడంతో ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుతున్నాయా అనే వివరాలను సేకరించి వాటిని సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నారు. సర్వేను ఎంపీడీవో పర్యవేక్షిస్తున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని 11 మండలాల పరిధిలో సుమారుగా రెండు లక్షలకు పైబడి ఇళ్లు ఉన్నాయి.

వివరాలు చెప్పేందుకు నిరాకరణ

పలు గ్రామాల్లో కుటుంబాల వ్యక్తిగత వివరాల సేకరణలో సచివాలయ సిబ్బందికి ప్రజల నుంచి సహకారం కొరవడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించింది. గత ఎన్నికలకు ముందుకు అనర్హులు ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని, తాము అధికారంలోకి వస్తే అనర్హులను ఏరివేస్తామంటూ కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అధికారంలోకి రావడంతోనే సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించడం ప్రారంభించింది. పింఛన్లలో కోత, కొత్తవి మంజూరు ఎండమావిగా మారింది. లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు పీ–4 పేరిట వివరాలు అడుగుతుంటే వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలను దూరం చేసేందుకే ఈ వివరాలు సేకరిస్తున్నారని సిబ్బందిపై మండిపడుతున్నారు. వివరాలు చెప్పేందుకు చాలా మంది నిరాకరిస్తున్నారు.

సర్వేపై ఆందోళన వద్దు



గ్రామాల్లో చేపడుతున్న పీ–4 సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజల జీవన ప్రమాణాలు స్థితిగతులను తెలుసుకుని సంక్షేమ పథకాలు అందించేందుకు నిర్వహిస్తోంది. ఉద్యోగులు ప్రణాళిక అంకితభావంతో సర్వేను ప్రభుత్వ లక్షణాలకనుగుణంగా చేస్తున్నారు.

– **జి.సరోవర్**, ఎంపీడీఓ, అంబాజీపేట

జగన్‌ను కలిసిన రాజా



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వింటి రాజా

అయినవిల్లి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి వింటి రాజా గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఉన్నతికి అన్ని విధాలుగా కృషి చేయాలని రాజాకు సూచించారు.

అన్నదానం ట్రస్టుకు రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన అల్లూరి దిలీఫ్‌కుమార్, స్వాతి దంపతులు గురువారం రూ.10 వేల విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజుకు అందజేశారు. దాత దంపతులకు ఈఓ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండల ఉపాధ్యక్షుడిగా పప్పుల సాయిబాబు ఎన్నిక

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ ప్రథమ ఉపాధ్యక్షుడిగా కూటమి అభ్యర్థి, జనసేన పార్టీకి చెందిన కుందాలపల్లి ఎంపీటీసీ పప్పుల వెంకట సాయిబాబు ఎన్నిక అయ్యారు. కూటమి పార్టీల మధ్య గతంలో కుదిరిన ఒప్పందంలో భాగంగా.. మండల ఉపాధ్యక్షుడిగా పనిచేసిన పాలూరి వీరభద్రరావు ఇటీవల రాజీనామా చేశారు. దీంతో ఆ పదవికి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. మండలంలో మొత్తం వైఎస్సార్ సీపీకి 9, టీడీపీకి 7, జనసేనకు 5, బీఎస్పీకి ఒక ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ, జనసేన పార్టీల నుంచి ఎంపీటీసీలకు విప్ జారీ చేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పప్పుల వెంకట సాయిబాబు, వైఎస్సార్ సీపీ నుంచి కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణలు ఉపాధ్యక్ష పదవికి పోటీలో నిలబడ్డారు. సాయిబాబుకు కూటమి ఎంపీటీసీలు 12 మందితో పాటు, బీఎస్పీ ఎంపీటీసీ అయినపర్తి ఇందిరా ప్రియదర్శిణి, వైఎస్సార్ సీపీకి చెందిన పల్లి మోషేలు చేతులు ఎత్తడంతో 14 ఓట్లు వచ్చాయి. దీంతో సాయిబాబు ఉపాధ్యక్షునిగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నుంచి పోటీలో ఉన్న కొల్లే సూర్యనారాయణకు 8 ఓట్లు వచ్చాయి. గౌరవ సభ్యుడిగా పాల్గొన్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సందర్భంగా సాయిబాబును సత్కరించారు. ఎంపీడీఓ కేవీ ప్రసాద్ ఎన్నికలను పర్యవేక్షించారు. అనంతరం కూటమి శ్రేణులు బాణసంచా కాల్చుతున్న సందర్భంలో జనసేన, వైఎస్సార్ సీపీ శ్రేణుల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. నాయకులు కలుగజేసుకుని సర్ది చెప్పారు.



సాయిబాబుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న రాజేశ్వరరావు. చిత్రంలో ఎమ్మెల్యే ఉన్నారు

వైస్ ఎంపీపీలుగా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు

సఖినేటిపల్లి: మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు ఇరువురు మండల వైస్ ఎంపీపీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ తరుపున వారిరువురు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవమైంది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి సిద్ధార్థ వర్ధన్ ఎన్నిక ప్రక్రియ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గొంది ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, ఉయ్యూరువారి మెరక ఎంపీటీసీ–2 గుబ్బల ఆంజనేయులు మండల వైస్ ఎంపీపీలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రత్యేకాధికారి ప్రకటించారు. వారికి ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. ఏకగ్రీవంగా ఎంపికైన శుభాకర్, ఆంజనేయులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు అభినందించారు. వైస్ ఎంపీపీలుగా మండలం అభివృద్ధికి తగిన కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సహచర ఎంపీటీసీలు కూడా అభినందించారు.



సఖినేటిపల్లిలో వైస్ ఎంపీపీలుగా ఎన్నికైన ఎంపీటీసీలను అభినందిస్తున్న గొల్లపల్లి

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నిక

మలికిపురం: మండలంలో ఉప సర్పంచ్ పదవికి ఖాళీలు ఏర్పడిన లక్కవరం, చింతలమోరి గ్రామ పంచాయతీలలో ఉపసర్పంచ్ ఎన్నికలు గురువారం జరిగాయి. లక్కవరం గ్రామ పంచాయతీలో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికలో 10వ వార్డు సభ్యుడు ఉలిశెట్టి లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతలమోరి గ్రామ పంచాయతీలో 9వ వార్డు సభ్యుడు కొల్లు ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఎన్నికైన వారికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ ఎన్నికలు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగాయని ఎంపీడీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఉప సర్పంచ్‌గా సాంబశివరావు

అంబాజీపేట: మాచవరం ఉప సర్పంచ్‌గా 14వ వార్డు సభ్యుడు మట్టపర్తి సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పంచాయతీ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ పదవికి ఎన్నికలు నిర్వహించామన్నారు. సుంకర పేరయ్యనాయుడు జంటిల్‌మన్ ఒప్పందం ప్రకారం తన ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక నిర్వహించామన్నారు. నూతనంగా ఎన్నికైన సాంబశివరావును సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

కొత్తపేట ఉప సర్పంచ్‌గా మారుతీప్రసాద్

కొత్తపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా విళ్ల మారుతీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు ఉప సర్పంచ్ కాగా ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో విళ్ల మారుతీప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఆ మేరకు గురువారం జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి కేఎస్ గౌరీకుమారి ప్రకటించారు. మారుతీప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం సర్పంచ్ బూసి జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మారుతీతో పదవీ ప్రమాణస్వీకారం చేశారు.

మోరిపోడు ఉపసర్పంచ్‌గా శ్రీను

సఖినేటిపల్లి: మోరిపోడు పంచాయతీ ఉపసర్పంచ్‌గా కడలి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పంచాయతీలో నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో శ్రీను ఏకగ్రీవంగా నిలిచారు. సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి, పాలకవర్గ సభ్యులు ఆయనను అభినందించారు.

పోతుకుర్రు ఉప సర్పంచ్‌గా మెండి లక్ష్మి

అయినవిల్లి: పోతుకుర్రు గ్రామంలో ఉప సర్పంచ్‌గా మెండి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ ఎన్నిక గురువారం మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పటి వరకూ పని చేసిన ఉప సర్పంచ్ జెంటిల్‌మేన్ ఒప్పందం ప్రకారం రాజీనామా చేయడంతో అధికారులు ఈ ఎన్నిక నిర్వహించినట్టు తెలిపారు.

ఉపసర్పంచ్‌గా దొరబాబు

ఆలమూరు: మోదుకూరులో గురువారం గ్రామ ఉప సర్పంచ్ ఉప ఎన్నిక జరిగింది. ఇప్పటి వరకూ ఉప సర్పంచ్‌గా ఉన్న బి.సుజాత రాజీనామా చేశారు. దీంతో గ్రామ పంచాయతీలో కార్యాలయం వద్ద నిర్వహించిన ఉప సర్పంచ్ ఉప ఎన్నికల్లో వార్డు సభ్యులు గొడితి దొరబాబు, యడ్లపల్లి శ్రీనివాసరావు లిద్దరూ పోటీపడి నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈఎన్నికల్లో వార్డు సభ్యుడు దొరబాబుకు మెజారిటీ రావడంతో ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలనాధికారిగా వ్యవహరించిన రావులపాలెం ఈఓపీఆర్‌డీ బి.కృష్ణ ప్రకటించారు. అనంతరం ఉప సర్పంచ్‌గా ఎన్నికైన దొరబాబుకు గ్రామ కార్యదర్శి కె.సాయిప్రసాద్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందజేశారు.



మోదుకూరులో ఉప సర్పంచ్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల పరిశీలనాధికారి



కొత్తపేట ఉప సర్పంచ్‌గా ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న మారుతీప్రసాద్

ఆదుకోవాలని కోరుతూ డీఆర్వోకు వినతి

మామిడికుదురు: ఆటో నడుపుతూ జీవనం సాగించే తన తండ్రి గొల్లమందల రవికుమార్(43) గుండెపోటుతో మృతి చెందాడని పెదపట్నంలంకకు చెందిన గొల్లమందల బాలాజీ డీఆర్వోకు గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత గుండెపోటుకు గురయ్యాడన్నారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి అమలాపురం ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు 108కు ఫోన్ చేయగా ప్రైవేటు ఆస్పత్రి తీసుకువెళ్లాలంటూ నిర్లక్ష్యంగా 108 డ్రైవర్ సమాధానం చెప్పారని ఆరోపించారు. మేము ఆటోలో తీసుకు వస్తాం ఎదురు రండి అని ప్రాధేయపడినా కనికరించలేదన్నారు. 20 కిలోమీటర్ల దూరంలోని అమలాపురం వెళ్లే సరికి ఆలస్యం కావడంతో తన తండ్రి చనిపోయాడని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో ఆస్పతికి తీసుకు వెళ్లి ఉంటే తన తండ్రి బ్రతికేవాడన్నారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన 108 డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఎంఎల్‌టీ చదివానని, తన సోదరి మహేశ్వరి ఇంటర్ చదువుతుందన్నారు. తన తండ్రి చనిపోవడంతో మా పోషణ వృద్ధులైన తాత, నానమ్మలతో పాటు తమను ఆదుకుని భరోసా కల్పించాలని అభ్యర్థించారు. బాలాజీ తరపున ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్, గ్రామ పెద్దలు గొల్లమందల రాజారావు, తాడి నరసింహారావు, విప్పర్తి నాగేశ్వరరావు డీఆర్వోకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్వో సానుకూలంగా స్పందించారని ఎంపీటీసీ జంగమయ్య తెలిపారు.



అమలాపురంలో డీఆర్వో రాజకుమారికి ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ జంగమయ్య

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించాలి

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ప్రభుత్వంపై పోరాటం సాగించాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతుందని గన్నవరపు వివరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహరావు, యన్నాబత్తుల ఆనంద్, వాసంశెట్టి తాతాజీ, నాయకులు కుంపట్ల గోపి, సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, గుత్తుల మధు, కొల్లే సూర్యనారాయణ, దాసరి మౌనిక, పులపర్తి రాజారావు, చిట్టూరి సావిత్రి, ముక్కామల భారతి, యాండ్ర విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పిల్లలపై జాగ్రత్తగా ఉండాలి

రావులపాలెం: పిల్లల పట్ల తల్లి దండ్రులు శ్రద్ధ వహించి కంటికి రెప్పలా జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ అన్నారు. మండల పరిధిలోని ఈతకోటలో గురువారం జెడ్పీ హైస్కూల్ రావులపాలెం పోలీస్ శాఖ, ఈతకోట గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ఆన్‌లైన్ గేమ్స్, గంజాయి, క్రికెట్ బెట్టింగ్, ర్యాగింగ్, జూదం, నేరాలు వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. రావులపాలెం టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై యస్.రాము. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుందర రామలక్ష్మణ శర్మ, పాఠశాల హెచ్ఎం కృష్ణారెడ్డి, పాఠశాల చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.అగ్రహారంలో డెంగీ కేసు నిర్ధారణ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం దంగేటివారి పాలెంలో ఓ మహిళలకు డెంగీ నిర్ధారణ అయినట్టు అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. దంగేటివారిపాలెంకు చెందిన రాయుడు పద్మ రెండు వారాల క్రితం అయినవిల్లి మండలం చింతనలంకలో కూలి పనికి వెళ్లడంతో జ్వరం వచ్చిందన్నారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించనప్పటికి జ్వరం తగ్గకపోవడంతో ఆమె బంధువులు కొత్తపేట సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపారన్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ వైద్యులు పద్మకు డెంగీ లక్షణాలు గుర్తించి నిర్ధారణ చేశారన్నారు. దాంతో దంగేటివారిపాలెంలో పారిశుధ్య పనులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు పర్యవేక్షణలో చేయించామన్నారు. అలాగే గ్రామంలో డోర్‌టుడోర్ సర్వే చేసి జ్వరాల బారిన పడిన వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. డెంగీ వ్యాధి సోకిన ఇంటి వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సీహెచ్ఓ బి.అప్పారావు పర్యవేక్షణలో పాలెంలో మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. డ్రైనేజీల వద్ద పారిశుధ్య పనులు చేపట్టామన్నారు.



జి.అగ్రహారంలో మెడికల్ క్యాంపు వద్ద సూచనలు చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది

గ్రామాల్లో ఆక్వా జోన్ గ్రామ సభలు

మామిడికుదురు: ఆక్వా జోన్ పరిధిలోకి రాని రైతులు తమ వివరాలను వెంటనే నమోదు చేసుకోవాలని మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సూచించారు. ఆక్వా జోన్ గ్రామ సభలు గురువారం మండల పరిధిలోని లూటుకుర్రు, పాశర్లపూడిలంక, పాశర్లపూడి గ్రామాల్లో జరిగాయి. ఆయా గ్రామ సభలకు సర్పంచులు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కొనుకు ప్రేమజ్యోతి అధ్యక్షతన వహించారు. లూటుకుర్రులో 199.10 ఎకరాల్లో చెరువులు సాగులో ఉండగా 75.76 ఎకరాల ఆక్వాజోన్ పరిధిలో లేవని చెప్పారు. పాశర్లపూడిలంకలో 157.07 ఎకరాల్లో చెరువులు విస్తరించి ఉండగా 33.87 ఎకరాల ఆక్వా జోన్ పరిధిలో నమోదు కాలేదని చెప్పారు. పాశర్లపూడిలో 38.94 ఎకరాల్లో ఆక్వా చెరువులు సాగులో ఉండగా ఎనిమిది ఎకరాల ఆక్వా జోన్ పరిధిలో నమోదు కాలేదన్నారు. దీని వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలు రైతులకు అందుబాటులో లేవని చెప్పారు. వీటిపై ఇప్పటికే సర్వే చేశామని, జాబితాలను పంచాయతీల్లో ప్రదర్శించామన్నారు. సభల్లో రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



లూటుకుర్రులో జరిగిన ఆక్వా జోన్ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ తాతకాపు

నైతిక విలువలకు టీడీపీ తిలోదకాలు

- పులిదిండిలో వైఎస్సార్ సీపీ ఉప సర్పంచ్‌కు టీడీపీ కండువా
- నీతిమాలిన చర్య అంటూ వైఎస్సార్ సీపీ ధ్వజం

కొత్తపేట: జెంటిల్‌మన్ ఒప్పందం ప్రకారం మెజార్టీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్న వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తికి టీడీపీ నాయకులు ఆ పార్టీ కండువా కప్పి టీడీపీ ఉప సర్పంచ్‌గా ప్రకటించుకున్నారు. నైతిక విలువలను తుంగలో తొక్కారు. గతంలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆత్రేయపురం మండలం పులిదిండి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. అప్పట్లో ఉప సర్పంచ్ పదవికి కోసం వార్డు సభ్యులు చిన్నం బేబి, మావుళ్ల శ్రీనివాసరావు ఇద్దరు పట్టుబట్టారు. దాంతో జెంటిల్‌మెన్ ఇప్పందాన్ని అమలు చేశారు. దాని ప్రకారం చిన్నం బేబీ పదవికి రాజీనామా చేయగా గురువారం స్థానిక సంస్థల ఉప ఎన్నికలు నిర్వహించి మావుళ్ల శ్రీనివాసరావును ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. తరువాత మావుళ్ల శ్రీనివాసరావును టీడీపీ మండల నాయకులు మభ్యపెట్టి, అతనికి వారి పార్టీ కండువా కప్పి టీడీపీ ఉప సర్పంచ్‌గా ప్రకటించుకున్నారు.

టీడీపీ చర్య సిగ్గు చేటు : వైఎస్సార్ సీపీ ధ్వజం

వైఎస్సార్ సీపీకి చెందిన సభ్యుడు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యాక టీడీపీ కండువా కప్పి ఆ పార్టీ ఉప సర్పంచ్‌గా ప్రకటించుకున్న ఆ పార్టీ నాయకుల నీతిమాలిన చర్య సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ విలువలు, విశ్వసనీయత లేని నాయకులు ఈ రోజు ఈ పార్టీ, రేపు మరో పార్టీకి వెళ్లరని గ్యారంటీ ఏమిటని వ్యాఖ్యానించారు. వైఎస్సార్ సీపీ విలువలు పాటిస్తూ ముందుకు వెళుతున్నందున అన్ని వర్గాల ప్రజలు తమతో ఉన్నారని, ఈ రోజు నాయకులు పార్టీ మారినంత మాత్రాన ప్రజలు మారలేదన్నారు. రాబోయే రోజుల్లో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ కనుమూరి సూర్యసుందరసీతాకుమారి, మాజీ ఉప సర్పంచ్ చిన్న బేబి, వార్డు సభ్యులు పెరవలి రాంబాబు, విప్పర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పులిదిండిలో మావుళ్ల శ్రీనివాసరావుతో సహా సమావేశమైన వార్డు సభ్యులు

విప్‌ను ధిక్కరించిన ఎంపీటీసీ మోషే పదవిని రద్దు చేయాలి

పి.గన్నవరం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల ఉపాధ్యక్ష ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించి, పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా వేరొక పార్టీ అభ్యర్థికి ఓటు వేసిన జి.పెదపూడి ఎంపీటీసీ పల్లి మోషే పదవిని రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ ఎన్నికలో జనసేన పార్టీ అభ్యర్థికి చేతులు ఎత్తే పద్ధతిలో మోషే ఓటు వేశారు. దీంతో పార్టీ విప్, మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల అధికారి రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. జి.పెదపూడి ఎంపీటీసీగా మోషే వైఎస్సార్ సీపీ నుంచి గెలిచారని వివరించారు. పార్టీ ఆదేశాల ప్రకారం మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణను తాము పోటీలో నిలిపామన్నారు. అయితే మోషే తమ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒకపార్టీపై గెలిచి, వేరొక పార్టీకి ఓటు వేసినందున అతని ఎంపీటీసీ పదవిని రద్దు చేయాలని కోరారు.